సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.64 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 52.64 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 110 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.93,950
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,495
3 శాతం జీఎస్టీతో	రూ.8,750
నవర (8 గ్రా)	రూ.70,000

గరిష్ఠం/కనిష్ఠం
38.4 /27.2

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 53 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి 21న పరీక్ష

నెల్లూరు (టౌన్): రానున్న విద్యాసంవత్సరంలో ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన పరీక్షను ఈ నెల 21న నిర్వహించనున్నామని డీఈఓ బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 20న నిర్వహించాలని తొలుత నిర్ణయించినా, ఈస్టర్ కావడంతో దాన్ని మరుసటి రోజుకు వాయిదా వేశారన్నారు. హాల్‌టికెట్లను cse. ap. gov. in లేదాలేదా apms. apcfss. in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

ఇంటర్‌లో సంస్కరణలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి జూనియర్ ఇంటర్‌లో చేపట్టిన సంస్కరణలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రిన్సిపల్స్‌తో సమావేశాన్ని నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల షెడ్యూల్, అకడమిక్ క్యాలెండర్, సిలబస్ మార్పు, కొత్త సబ్జెక్టుల కాంబినేషన్, మార్కుల కేటాయింపు, ప్రశ్నపత్రాల డిజైన్ మార్పు, పని గంటల పెంపు తదితరాలను తెలియజేశారు. డీవీఈఓ మధుబాబు, సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డీటీసీ డీఎస్పీ బదిలీ

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులను డీజీపీ గురువారం జారీ చేశారు. ఇందులో భాగంగా నెల్లూరు డీటీసీ డీఎస్పీ గిరిధర్‌రావును ఏసీబీకి బదిలీ చేశారు. విధుల నుంచి రిలీవై బదిలీ అయిన ప్రాంతంలో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్పీ కృష్ణకాంత్‌కు అస్వస్థత

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ కృష్ణకాంత్ అస్వస్థతకు గురై నగరంలోని కిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. క్యాంప్ కార్యాలయంలో విధులను గురువారం నిర్వర్తిస్తుండగా, సొమ్మసిల్లారు. గమనించిన కుటుంబసభ్యులు, పోలీస్ అధికారులు ఆయన్ను హుటాహుటిన కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. వివిధ పరీక్షలను వైద్యులు నిర్వహించారు. వేసవి తీవ్రతతో డీహైడ్రేషన్‌తో అస్వస్థతకు గురయ్యారని, ప్రమాదమేమీలేదని తెలిపారు. కాగా ఎస్పీ ఆరోగ్య పరిస్థితిపై హోంమంత్రి అనిత ఆరాతీశారని సమాచారం. పలువురు పోలీస్ అధికారులు పరామర్శించారు.

ఘనంగా భగవాన్ మహావీర్ జయంతి



నెల్లూరు(బృందావనం) : నగరంలో భగవాన్ మహావీర్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీజైన్ శ్వేతాంబర్‌మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జైన మత గురువులు పన్యాస్ సమర్పణప్రభ, మునిరాజ్ ధ్యానప్రభ, దేవోదయప్రభ కార్యక్రమాన్ని జరిపించారు. తొలుత మండపాలవీధిలోని శ్రేయాన్స్‌నాథ్ ఆలయంలో భగవాన్ మహావీర్ విగ్రహానికి అభిషేకం చేశారు. మండపాల వీధిలో ఉన్న జైన దేవాలయం నుంచి నగరోత్సవం ప్రారంభమై చిన్నబజార్, పెద్దబజార్, ఆచారివీధి, కాపువీధి మీదుగా మండపాలవీధికి చేరుకుంది. కిశోర్‌కుమార్ లుంకడ్ తన సంగీత స్వరంతో అలరించారు.

చిరుత సంచారం..?

దుత్తలూరు: మండలంలోని కొత్తపేట సమీపంలో చిరుత సంచారాన్ని ఓ వ్యక్తి గుర్తించారు. వివరాలు.. గ్రామానికి చెందిన నరసింహారావు కొత్తపేట సమీపంలోని వాగు వద్దకు బహిర్భూమికి వెళ్లారు. అక్కడ చిరుత కనిపించడంతో భయంతో పరుగులు తీసి గ్రామస్తులకు విషయాన్ని తెలియజేశారు. దీనిపై జిల్లా అటవీ అధికారి మహబూబ్‌బాషాకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో ఉదయగిరి రేంజ్ అధికారి కుమార్‌రాజాను వెళ్లి పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఈ తరుణంలో డీఆర్వో మురళి, ఎఫ్బీఓ ప్రసాద్, అటవీ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని వాగు ప్రాంతంలో పాదముద్రల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎక్కడా ఆనవాళ్లు కనిపించలేదు. గడ్డి బాగా పెరిగి ఉండటంతో పాదముద్రలు కనిపించలేదని, గ్రామస్తులు చెప్పే ఆనవాళ్ల బట్టి అడవిపిల్లిగా అనుమానిస్తున్నట్లు అటవీ అధికారులు చెప్పారు.

కార్పొ'రేటు' తగ్గదండీ

విద్యార్థి భవిష్యత్తుకు ఇంటర్ విద్య ఎంతో కీలకం. తమ పిల్లలు ఇందులో మంచి మార్కులు సాధిస్తే వారి భవితకు ఢోకా ఉండదనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ఉంటున్నారు. దీన్నే కార్పొరేట్ యాజమాన్యాలు చక్కగా క్యాష్ చేసుకుంటున్నాయి. ప్రథమ సంవత్సర అడ్మిషన్లు సోమవారం ప్రారంభం కావడంతో కోర్సులు, ఫీజులపై కళాశాలల ప్రతినిధులను సంప్రదిస్తుండగా, వారు చెప్పే రేట్లు విని గుడ్లు తేలేయడం పేరెంట్స్ వంతవుతోంది.

- ఇంటర్‌లో కోర్సును బట్టి ఫీజులు
- అడ్మిషన్ కావాలంటే 50 శాతాన్ని చెల్లించాల్సిందే
- కొత్త పేర్లు పెట్టి నయా దోపిడీ
- పుస్తకాలకు అదనంగా వసూళ్లు
- ఎటూ తేల్చుకోలేకపోతున్న తల్లిదండ్రులు


నెల్లూరు(టౌన్): ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభయ్యాయో లేదో ఫీజుల దోపిడీకి కార్పొరేట్ యాజమాన్యాలు తెరలేపాయి. వాస్తవానికి ఇందులో ఎంపీసీ, బైపీసీ కోర్సులంటే యమ క్రేజ్. వీటికి రకరకాల పేర్లు తగిలించి ప్రత్యేక ఫీజులు వసూలు చేస్తున్నారు. డే స్కాలర్‌కు రూ.90 వేల నుంచి రూ.1.65 లక్షల వరకు.. అదే హాస్టల్ వసతి కూడా కలిపితే రూ.రెండు లక్షల నుంచి రూ.3.75 లక్షల వరకు వసూలు చేస్తున్నారంటే వీరి ధనదాహం ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం సైతం వీరికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ, సామాన్య, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేస్తోందనే ఆరోపణలూ లేకపోలేదు.

నియంత్రణ.. డొల్ల

జిల్లాలో 136 కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో ఏటా 23 వేల మందికి పైగా విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు సోమవారం.. ద్వితీయ సంవత్సర తరగతులు ఈ నెల ఒకటిన షురూ అయ్యాయి. ఈ నెల 23 వరకు బ్రిడ్జి కోర్సులనే నిర్వహించాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. 24 నుంచి జూన్ ఒకటి వరకు వేసవి సెలవులు.. మరుసటి రోజున కళాశాలలను పునఃప్రారంభించాలని ఆదేశించారు. అడ్మిషన్ల సమయంలో తాత్కాలిక ఫీజులనే వసూలు చేయాలనే ఆదేశాలు ఉన్నా, నియంత్రణ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. సిలబస్‌ను ఇప్పటి నుంచే ప్రారంభిస్తున్నామనీ చెప్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో తల్లిదండ్రులున్నారు.

సగం చెల్లిస్తేనే ఖరారు

కోర్సు, బ్రాంచీలను బట్టి ఫీజులను నిర్ణయించారు. ఐఐటీ, నీట్, ఎంసెట్‌లో ర్యాంకులంటూ రకరకాల కోర్సులను ప్రవేశపెట్టారు. ఎంపీసీలో స్టార్ సూపర్ చైనా, సీఓ సూపర్ చైనా, ఎన్ 120, సీఓ స్పార్క్, స్పార్క్, నీట్ తదితర పేర్లను ఖరారు చేసి ఫీజులను నిర్ధారించారు. అడ్మిషన్ సమయంలో మొత్తం ఫీజులో 50 శాతాన్ని చెల్లిస్తేనే ఖరారవుతుందని యాజమాన్యాలు చెప్తున్నాయి. వేసవి సెలవులయ్యాక ఇప్పటి ఫీజు ఉండదని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన ఫీజులో రూ.10 వేల నుంచి రూ.15 వేలు అదనంగా వసూలు చేస్తున్నారు.



ఫీజులిలా (రూపాయల్లో)

కోర్సు	డే స్కాలర్	హాస్టల్
ఎంపీసీ	90 వేలు - 1.65 లక్షలు	1.95 లక్షలు - 3.75 లక్షలు
బైపీసీ	లక్ష - 1.6 లక్షలు	రెండు లక్షలు - రూ.3.5 లక్షలు

ల్యాబ్, రికార్డుల కోసం రూ.మూడు వేలు - రూ.ఐదు వేలు

ఫీజుల దోపిడీని అరికట్టాలి



కార్పొరేట్ యాజమాన్యాల ఫీజు దోపిడీని అరికట్టాలి. లక్షల్లో వసూలు చేస్తున్నా, బోధన, వసతులు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు.
– ఆదిత్యసాయి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్యార్థి జేఏసీ

ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి



పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలి. ధరల పట్టికను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాల్సి ఉన్నా, ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.
– లీలామోహన్, రాష్ట్ర కార్యదర్శి, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ

నామినల్ ఫీజులనే వసూలు చేయాలి



నామినల్ ఫీజులనే వసూలు చేయాలని యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్‌కు జూమ్ మీటింగ్ ద్వారా ఆదేశాలు జారీ చేశాం. రెగ్యులర్ తరగతులను జూన్ రెండు నుంచి నిర్వహించాలి. ఫీజుల వసూళ్లపై ఫిర్యాదులొస్తే చర్యలు చేపడతాం.
– ఆదూరు శ్రీనివాసులు, ఆర్ఐఓ

పట్టించుకోని అధికారులు..

ఇంటర్ బోర్డు అధికారులు సైతం కార్పొరేట్ యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధిక ఫీజులను వసూలు చేస్తున్నా, వీటి వివరాలను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించకపోయినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రికి సంబంధించిన విద్యాసంస్థలే అధికంగా ఉండటంతో అటువైపు అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. మరోవైపు ఆయా కళాశాలలు నిర్వహిస్తున్న హాస్టళ్లకు ఎలాంటి అనుమతులూ ఉండవు. ఎంఈడీ చేసిన అధ్యాపకులు ఉండాల్సి ఉన్నా, డిగ్రీ, పీజీ వారితోనే బోధన చేయిస్తున్న పరిస్థితి నెలకొంది. అంతంతమాత్రంగా మారిన వసతులతో పాటు భోజనం నాసిరకంగా ఉంటోందని విద్యార్థులే చెప్తున్నారు. ఇప్పటికైనా వీరి దోపిడీని అరికట్టేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రెడ్‌బుక్ రాజ్యాంగంతో కక్షసాధింపు



మాట్లాడుతున్న విక్రమ్‌రెడ్డి, పక్కన ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సంజీవయ్య, చంద్రశేఖర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- పార్టీ నేతల విలేకరుల సమావేశం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. రాజకీయ కక్షసాధింపులకే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని విక్రమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్ తదితరులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న ఆయనపై రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేశారని మండిపడ్డారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కథనాన్ని ప్రచురించిన ఈనాడు దినపత్రిక.. ఆయన్ను దోషి అని తేల్చేసిందని విమర్శించారు. ఒకవేళ ఇదే నిజమైతే వారి వద్ద ఉన్న ఆధారాలను కోర్టుకు ఎందుకు ఇవ్వలేదని, ఇది కుట్ర కాదానని ప్రశ్నించారు. తొలుత ఆరోపణలు చేయడం, దాన్ని మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఆపై కేసులు నమోదు చేయించడం వంటి పనులు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు ఎలాంటి పనులు చేయొద్దంటూ ఓ సభలో సీఎం చంద్రబాబే చెప్పారని, తమ పార్టీకి 40 శాతం మంది ఓట్లేశారని, ప్రభుత్వం నుంచి వీరు ఎలాంటి లబ్ధి పొందకూడదానన్నారు. జిల్లాలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను అమలు చేస్తే పది నెలల వ్యవధిలో ఇసుక, మైనింగ్, మట్టి ఇలా అన్ని అంశాల్లో జరుగుతున్న అవినీతి బయటపడుతుందని తెలిపారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అరెస్ట్ చేసేలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా పాలన సాగించాలని సూచించారు.

బలంగా గొంతు వినిపిస్తే కేసులే

ప్రతిపక్ష పార్టీలో ఎవరైతే బలంగా గొంతు వినిపిస్తున్నారో వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పోలీస్ శాఖను ప్రభుత్వం ఎలా వాడుకుంటోందనేందుకు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై జరుగుతున్న వేధింపులే ప్రత్యక్ష నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాకాణి, ఆయన కుటుంబసభ్యులపై కేసులు పెట్టి వేధించడాన్ని ఖండించారు. ఇలా వ్యవహరిస్తే తమ పార్టీ శ్రేణులు భయపడతారనుకుంటే అది భ్రమేనన్నారు. కావలి నియోజకవర్గంలో బెట్టింగ్‌లు, క్యాసినో తదితరాలను ఎలా ఆడిస్తున్నారో అందరూ చూస్తూనే ఉన్నారని చెప్పారు. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి ఓటేసి జగన్‌మోహన్‌రెడ్డికి అన్యాయం చేశామనే పశ్చాత్తాపం గ్రామాల్లో మహిళల నుంచి వ్యక్తమవుతోందని వివరించారు. టీడీపీ నేతల ఒత్తిడితో మీరు చేసే పనులు శాపాలుగా మారకుండా చూసుకోవాలని హితవు పలికారు. పార్టీ జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, అత్రి త్రెడ్డి, మండల కన్వీనర్లు పిచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దృష్టికి రెవెన్యూ సమస్యలు



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: రెవెన్యూ అధికారులకు క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న రెవెన్యూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యలపై కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఉదయభాస్కరరావు, ఆర్డీఓలతో అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. పలు పరిశ్రమలు, విద్యాసంస్థల ఏర్పాటుకు భూముల కేటాయింపు, ప్రైవేట్ పట్టా భూములను నిషేధిత 22 ఏ జాబితా నుంచి తొలగించడం తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు తీసుకొచ్చారు. వీటిపై చర్చించి పరిష్కారానికి తగు సూచనలు చేశారు. జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డుల ఏడీ నాగశేఖర్, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు అనూష, వంశీకృష్ణ, పావని పాల్గొన్నారు.

ఉన్నతాధికారి టు కాంట్రాక్టర్

- ఇరిగేషన్‌లో అవినీతి పర్వం
- బినామీ పేర్లతో నిధుల స్వాహా
- గండిపాళెం జలాశయ మరమ్మతుల్లోనూ ఇదే తీరు
- సదరు ఆఫీసర్ అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు



గండిపాళెం జలాశయం

అక్రమ పంథాను కొనసాగించడం ఇరిగేషన్ శాఖలో ఓ కీలక అధికారికి వెన్నతో పెట్టిన విద్య. ఆత్మకూరు డివిజన్లో విధులు నిర్వర్తిస్తున్న ఈయన అక్రమ కార్యకలాపాలను సాగిస్తూ పెద్ద మొత్తాన్ని తన జేబులో వేసుకుంటున్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని ఇరిగేషన్ పరిధిలో గతంలో జరిగిన, ప్రస్తుతం చేపట్టిన పనుల్లో బినామీ కాంట్రాక్టర్లను నియమించుకొని పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయ మరమ్మతు పనుల్లో భారీగా అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయి. 2022లో జరిగిన ఈ వ్యవహారంలో డొల్లతనం ఆర్టీ యాక్టు ద్వారా బట్టబయలైంది. పెయింటింగ్, కొత్త లైట్లను అమర్చడం, రేడియల్ గేట్స్, మోటార్ రిపేర్లకు గాను సదరు అధికారి తన బినామీ కాంట్రాక్టర్‌గా నెల్లూరుకు చెందిన అనుచరుడు హేమంత్ వర్మను నియమించుకున్నారు. ఇంకేముంది తూతూమంత్రంగా పనులు చేసి రూ.12 లక్షలను కాజేశారనే ఆరోపణలున్నాయి.

స్వాహాకు కేరాఫ్

జలాశయ ప్రధాన కాలువ మరమ్మతుల కోసం రూ.4.5 లక్షలను కేటాయించగా, పనులు చేయకుండానే నిధులను కాజేశారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన పాత ఇనుప సామగ్రిని 2022లో రహస్యంగా వేలం వేయించి, తమ బినామీ హేమంత్ ద్వారా స్వాహా చేశారు. వేలాన్ని ఎప్పుడు.. ఎక్కడ నిర్వహించారు.. ఎంత మంది పాలుపంచుకున్నారు.. ఎంత వచ్చిందనే అంశం పెరుమాళ్లకే ఎరుక. అదే ఏడాది జలాశయంలో ఉన్న రూ.లక్షల విలువజేసే కర్రతుమ్మ చెట్లను వేలం వేయకుండానే విక్రయించారని తెలుస్తోంది.

ఎవర్నీ వదలరు..

ఆత్మకూరు డివిజన్లో జరిగిన పలు పనులకు సంబంధించి ముందే తన అనుకూల ట్రేడర్లకు జీఎస్టీ బిల్లులు జమ చేసి సుమారు రూ.కోటి మేర స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. ఉదయగిరిలో ప్రస్తుతం జరుగుతున్న పలు ఇరిగేషన్ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించకుండానే బిల్లులు చేస్తూ కాంట్రాక్టర్ల వద్ద అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. గండిపాళెం జలాశయంలో చేపలు పెంచి, పట్టుకునే మత్స్య సొసైటీ సభ్యుల నుంచి కిలో చేపలకు రూ.పది వంతున వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

విసిగివేసారి విజిలెన్స్‌కు..

ఆత్మకూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌పై పలు అవినీతి ఆరోపణలు చేస్తూ గండిపాళెం ప్రాజెక్ట్‌కు చెందిన పలువురు ఆయకట్టు రైతులు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తమ్ముళ్లకు ఇసుకాసులు

పొట్టేపాళెం రీచ్‌లో జేసీబీలతో తవ్వకాలు

- సమీపంలోని పల్లెపాళెం వద్ద కరకట్టను ధ్వంసం చేసి..
- అడ్డదారిలో తరలింపు
- రోజూ 20 ట్రాక్టర్లలో 250 ట్రిప్పులకుపైగా రవాణా
- అధికారులు, మీడియా ప్రతినిధుల రాకపోకలపై నిఘా



రీచ్‌లోకి చిన్న వాహనాలు వెళ్లకుండా అడ్డంగా వేసిన ఇసుక



పొట్టేపాళెంలో జేసీబీతో తవ్వకాలు

నెల్లూరు సిటీ: ఇసుక ఉచితమని ప్రభుత్వం ఊదరగొట్టినా, క్షేత్రస్థాయిలో అదంతా వట్టిదేనని తేలిపోతోంది. క్షేత్రస్థాయిలో ఇసుకాసురులు చెలరేగిపోతూ నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలతో తవ్వకాలు సాగిస్తూ ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పొట్టేపాళెం అరుంధతీయపాళేనికి సమీపంలోని పల్లెపాళెం వద్ద గత కొన్ని వారాలుగా జేసీబీలతో తవ్వకాలు సాగిస్తున్నారు. ఇక్కడ కరకట్టను తొలగించి తమ పనిని కొనసాగిస్తున్నారు.

ఆ ఇద్దరి కనుసన్నల్లోనే..

టీడీపీ రూరల్ నియోజకవర్గ ముఖ్యనేతకు అనుచరులైన కాంట్రాక్టర్లు అచ్యుత్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వ్యవహారం సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ ఇద్దరూ పొట్టేపాళెంపై దృష్టి సారించారు. గతంలో రాత్రి వేళ తంతు సాగిస్తుండగా, ప్రస్తుతం పగలూ నిరాటంకంగా సాగుతోంది.

దారుల ఏర్పాటు

పొట్టేపాళెం వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన రీచ్ నుంచి నిత్యం 20 ట్రాక్టర్లలో 250కుపైగా ట్రిప్పులను తరలిస్తున్నారు. నెల్లూరు – పొట్టేపాళెం ప్రధాన రోడ్డు నుంచి అంజనీ వనం లేఅవుట్ మీదుగా దారులను ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి అరుంధతీయవాడలోని ఓ చిన్న వీధి మీదుగా ఇవి వేగంగా వెళ్తున్నాయి.

బయటవారు రాకుండా నిఘా

ఇసుక తవ్వకాలు సాగించే ప్రాంతానికి మైనింగ్, రెవెన్యూ అధికారులు, మీడియా ప్రతినిధులు రాకుండా గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. అరుంధతీయవాడ వద్ద పల్లెపాళెం కరకట్టను తొలగించి, ఆ ప్రాంతానికి బైక్‌లు, కార్లు రాకుండా ఇసుకను అడ్డంగా వేశారు. ట్రాక్టర్లు మాత్రమే తిరిగేలా, ఇతర వాహనాలు వస్తే ఇరుక్కుపోయేలా ఏర్పాట్లు చేశారు. రీచ్ రహదారి వెంబడి నిఘా నిమిత్తం నలుగుర్ని ఏర్పాటు చేశారు. ఎవరు లోపలికొచ్చినా ఫోన్ల ద్వారా సమాచారం చేరవేసేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో లోపలికి వెళ్లేందుకు ఎవరూ సాహసించడంలేదు.

క్లుప్తంగా

బ్యాంక్ ఉద్యోగం పేరిట మోసం


• ఇద్దరిపై కేసు నమోదు


నెల్లూరు(క్రైమ్): బ్యాంక్ ఉద్యోగం పేరిట మోసగించిన ఓ మహిళ, ఆమె తండ్రిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కరెంటాఫీస్ సెంటర్‌కు చెందిన శ్రీదేవి గతంలో ముత్తూట్ సంస్థలో పనిచేసింది. 2021 నవంబర్‌లో చవటపల్లి గ్రామానికి చెందిన రజిత అలియాస్ రమ్య గోల్డ్ లోన్ కోసం అక్కడికి వెళ్లింది. తాను మాదాపూర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో పనిచేస్తున్నానని శ్రీదేవితో పరిచయం చేసుకుంది. వివిధ బ్యాంక్‌ల ఉన్నతాధికారులు బాగా తెలుసని నగదు కడితే ఉద్యోగం ఇప్పిస్తానని రమ్య నమ్మబలికింది. ఆమె మాటలు గుడ్డిగా నమ్మిన శ్రీదేవి పలు దఫాలుగా రమ్య, ఆమె తండ్రి వెంకటేశ్వర్లు బ్యాంక్ ఖాతాకు రూ.9.60 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో రమ్య స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరిట నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్, ఐడీకార్డు ఇచ్చి 2022 ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరాల్సి ఉంటుందని చెప్పింది. నెలలు గడుస్తున్నా ఉద్యోగంలో చేర్చలేదు. దీంతో బాధితురాలికి అనుమానం వచ్చింది. ఆమె రమ్యను నిలదీయగా కొంత సమయం ఇస్తే నగదును తిరిగిస్తానని చెప్పి నమ్మకం కలిగించేందుకు రూ.70 వేలు ఇచ్చింది. మిగిలిన నగదు ఇవ్వకుండా బాధితురాలిని తిప్పుకోవడంతోపాటు బెదిరింపు చర్యలకు దిగింది. దీంతో శ్రీదేవి గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమ్య, ఆమె తండ్రి వెంకటేశ్వర్లుపై కేసు నమోదైంది.

వణుకుతూ.. ఇబ్బంది పడుతూ..

జిల్లాలో పెరుగుతున్న పార్కిన్సన్స్ వ్యాధిగ్రస్తులు

• ఏటా కొత్త కేసుల నమోదు
• క్రమం తప్పకుండా మందులు వాడాల్సిందే..
• లేకుంటే ముప్పు
• నేడు ప్రపంచ పార్కిన్సన్స్ (వణుకుడు రోగం) నివారణ దినోత్సవం





నెల్లూరు(అర్బన్): కొంతమంది చేతులు, లేదా మెడ నిరంతరం వణుకుతూ ఉంటాయి. మరికొందరికి తల ఊగిసలాడుతుంది. పలువురు కనీసం గ్లాసును గట్టిగా పట్టుకోలేక మంచినీరు తాగలేక ఇబ్బందులు పడుతుంటారు. వణుకుతూ భోజనం తినాల్సిందే. సమాజంలో ఇలాంటి వారు అరుదుగా కనిపిస్తారు. పార్కిన్సన్స్ (వణుకుడు రోగం) అనే జబ్బు వల్ల ఇలా జరుగుతుంది. ఇది ఒకసారి వస్తే జీవితాంతం బాధపడాల్సిందే.

అందువల్లే..

మెదడులో సబ్‌స్టాంటియా నిగ్రా అనే భాగంలో నాడీ కణాలు కోల్పోవడం వల్ల పార్కిన్సన్స్ అనే వణుకుడు జబ్బు వస్తుంది. కేంద్ర నాడీ వ్యవస్థకు సంబంధించిన న్యూరో డీజెనరేటివ్ వ్యాధి ఇది. సోకిన ప్రజలు అనేక విధాలుగా ఇబ్బంది పడతారు. ఈ జబ్బున్న వారు తమ శరీరమంతా అలసిపోయినట్టు భావిస్తారు. చేతులు, కాళ్ల వణుకుతుంటాయి. తల తిరగడం, బ్యాలెన్స్ తప్పిపోవడం, నిద్రలేమి, మతిమరుపు, కన్‌ఫ్యూజన్, వాసన అనే లక్షణం కోల్పోవడం జరుగుతుంది. కొంతమందికి మలబద్ధకం ఉంటుంది. మరికొందరు మానసికంగా కుంగుబాటుకు లోనవుతారు. నిధానంగా నడుస్తుంటారు. మాట కూడా నిధానమవుతుంది. అప్పుడప్పుడు బిగుసుకు పోతుంటారు. ఒక్కోదఫా పట్టుతప్పి (బ్యాలెన్స్ కోల్పోయి) పడిపోతుంటారు. తినేందుకు, మంచినీరు తాగేందుకు సైతం ఇబ్బంది పడాల్సిందే.

జిల్లాలో ఇలా..

జిల్లాలో పాత, కొత్త కేసులు కలిపి సుమారు 5 వేల మందికి పైగా రోగులున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అంచనా వేసింది. సంవత్సరంలో ప్రతి లక్ష మందిలో సుమారు 40 మంది వరకు ఈ వ్యాధికి గురవుతున్నట్లు చెబుతున్నారు. ఒక్కోసారి ఈ జబ్బుకు గురైతే జీవితాంతం వెంటాడుతుంది. బీపీ, షుగర్ వచ్చిన వారిలా నిత్యం మందులు వాడాల్సిందే.

మందులతో నియంత్రణ

పార్కిన్సన్స్‌కు గురయ్యే వారికి పూర్తిస్థాయి చికిత్స లేదు. అయితే మందులతో జబ్బును నియంత్రించవచ్చు. అవసరమైన వారికి డీ బ్రెయిన్ స్టిములేషన్ అనే చిన్న ప్రొసీజర్ (సర్జరీ లాంటిది) చేస్తారు. దీంతో జబ్బు నియంత్రణలోకి వస్తుంది. అందువల్ల జబ్బున్న వారు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

డాక్టర్‌ను సంప్రదించాలి

ప్రధానంగా చేతులు, మెడ వణుకుతున్న లక్షణాలు ఒకటి, రెండుసార్లు కనిపించినప్పుడు న్యూరాలజీ డాక్టర్‌ను సంప్రదించి సలహా తీసుకోవాలి. పరీక్షలు చేసి పార్కిన్సన్స్ అనే జబ్బు అవునో.. కాదో నిర్ధయిస్తారు. ఒకవేళ ఉంటే ప్రాథమిక దశలోనే చికిత్స చేయడం వల్ల ఆ జబ్బు ముదరకుండా పూర్తిస్థాయి నియంత్రణలో ఉంచవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల శరీర సమతుల్యతను కాపాడుకునేందుకు వీలవుతుంది. మాత్రలు వాడటం ద్వారా మిగిలిన వారిలా సాధారణ జీవితం గడపొచ్చు.

– డాక్టర్ ఫణికుమార్, న్యూరో ఫిజీషియన్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, నెల్లూరు

మంచి ఆహార అలవాట్లు తప్పనిసరి



వ్యాధి రాకుండా ఉండేందుకు మంచి ఆహారపు అలవాట్లు పాటించాలి. ఒమేగా – 3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్లు సమృద్ధిగా ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవడం, బ్రెయిన్‌కు ఒత్తిడి లేకుండా తగినంత విశ్రాంతి తీసుకోవడం, తగినంత నిద్రపోవడం కూడా అవసరం. కొంతమందికి వంశపారంపర్యంగా కూడా ఈ జబ్బు వచ్చే అవకాశం కూడా ఉండొచ్చు. ఏది ఏమైనా బ్యాలెన్స్‌డ్ ఆహారం వల్ల జబ్బు వచ్చే అవకాశాన్ని తగ్గించవచ్చు.

– డాక్టర్ దీక్షాంతి నారాయణ్, మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నెల్లూరు

సముద్రంలో యువకుడి గల్లంతు



హేమంత్ (ఫైల్)

ఉలవపాడు: సముద్రంలో యువకుడు గల్లంతైన ఘటన మండల పరిధిలోని కరేడు తీరంలో గురువారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. కరేడు చైతన్యనగర్‌కు చెందిన శింగోతు హేమంత్ ఇటీవల ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాశాడు. గురువారం మధ్యాహ్నం తన ఇద్దరు మిత్రులతో కలిసి తమ కాలనీకి అర కిలోమీటర్ దూరంలో ఉన్న సముద్రంలో స్నానానికి వెళ్లాడు. హేమంత్ అలల తాకిడికి లోపలికి వెళ్లిపోయాడు. స్నేహితులు గ్రామంలో సమాచారం అందించడంతో అక్కడివారొచ్చి వెతికారు. అయితే ఉపయోగం లేకుండా పోయింది. ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుమారుడు గల్లంతవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.85
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

అదనపుకట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపుకట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్త, అత్తింటివారిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. వనంతోపు ప్రాంతానికి చెందిన వేద, శ్రీనివాసులు దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. వివాహ సమయంలో వేద తల్లిదండ్రులు శ్రీనివాసులుకు రూ.11 లక్షల్ని కట్నకానుకుల కింద ఇచ్చారు. కొంతకాలం వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. భర్త, మామ, బావ, చిన్న అడపడుచు, ఆమె భర్త అదనపుకట్నం కోసం వేదను చిత్రహింసలు పెట్టడం ప్రారంభించారు. ఈ మేరకు బాధితురాలు గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• నెల్లూరు సిటీ: అదనపుకట్నం కోసం భర్త వేధిస్తున్నాడని ఓ మహిళ నెల్లూరు రూరల్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. వారి కథనం మేరకు.. గొల్లకందుకూరు గ్రామంలో శ్రీధర్, విష్ణు వందనలకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా శ్రీధర్ అదనపుకట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు డ్రైవర్ దారుణ హత్య



రోదిస్తున్న వాసు తల్లి



వాసు మృతదేహం

• మృతదేహాన్ని చెత్తకుప్పలో పడేసిన వైనం
• పోలీసుల అదుపులో నిందితులు

నెల్లూరు(క్రైమ్): ఓ కారు డ్రైవర్‌ను కొందరు దారుణంగా హత్య చేశారు. మృతదేహం ఎవరికీ కనిపించకుండా ఉండేందుకు తొలుత శ్మశానంలో పూడ్చిపెట్టాలని చూశారు. వీలుకాకపోవడంతో చెత్తకుప్పలో పడేసి గోతాన్ని కప్పి పరారయ్యారు. ఈ ఘటన నెల్లూరు ప్రగతినగర్ ఏ బ్లాక్‌లో చోటుచేసుకుంది. గురువారం పోలీసులు, బాధితులు వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరిగలదిన్నె గ్రామానికి చెందిన మాధవ, జ్యోతి దంపతులకు వాసు (23), వాసవి సంతానం. మాధవ కుటుంబం సుమారు 11 సంవత్సరాల క్రితం నెల్లూరు నగరానికి వలసొచ్చింది. వారు ప్రస్తుతం ప్రగతినగర్ ఏ బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. మాధవ ఓ ప్రైవేట్ హాస్పిటల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. వాసు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. పలువురితో అతడికి గొడవలున్నాయి.

హత్య చేశారిలా..

పని ఉందంటూ వాసు బుధవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి ఏడు గంటల సమయంలో తండ్రికి ఫోన్ చేసి పనిమీద ఉన్నానని ఇంటికి రావడం ఆలస్యమవుతుందని చెప్పాడు. అర్ధరాత్రి ఓ యువకుడిపై వాసు కత్తితో దాడి చేశాడు. సదరు యువకుడు ఈ విషయాన్ని అప్పటికే వాసు వల్ల ఇబ్బందులు పడుతున్న వినయ్, మణికంఠ, లోకేశ్ అలియాస్ ఛత్రపతి, తేజ, సంతోష్‌తోపాటు మరికొందరికి తెలియజేశాడు. అందరూ కలిసి వాసును ఆర్టీసీ బస్టాండ్ వద్ద పట్టుకుని ప్రగతినగర్ ఏ బ్లాక్ పదో వీధిలోని దర్గా వద్దకు తీసుకొచ్చారు. దర్గా ఎదురుగా ఉన్న రోడ్డుపై అతడిని తీవ్రంగా కొట్టి తమ వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని వెంగళరావ్‌నగర్ సమీప చెరువులో పూడ్చిపెట్టేందుకు తీసుకెళ్లగా అక్కడ జనసంచారం ఉండటంతో ప్రగతినగర్ పదో వీధి కింద చెరువు సమీపంలోని చెత్తకుప్పలో పడేశారు. మృతదేహం కనిపించకుండా ఉండేందుకు పెద్ద చెత్త మూటను పైన వేసి పరారయ్యారు.

గుర్తించిన స్థానికులు

గురువారం ఉదయం అటుగా వెళుతున్న స్థానికులు చెత్తకుప్పలో మృతదేహం ఉండటాన్ని గమనించి దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలోనే మృతుడి స్నేహితులు లోకేశ్, బాదుల్లా ఈ విషయాన్ని బాధిత తల్లిదండ్రులకు తెలియజేశారు. నగర డీఎస్పీ పి.సింధుప్రియ, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ఛాతి, పొట్ట, గొంతు ఇలా అనేక చోట్ల పెద్దసంఖ్యలో కత్తిపోట్లు ఉన్నాయి. పేగులు సైతం బయటకు వచ్చి ఉన్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న మాధవ, జ్యోతి విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా రోదించారు. మాధవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సాంకేతికత ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. వాసు కనిపించిన ప్రతిఒక్కరితో గొడవలు పడుతుండేవాడు. నిందితుల్లో పలువురితో పాతకక్షలున్నట్లు విచారణలో వెల్లడైంది. మూడునెలల క్రితం సారాయంగడి సెంటర్‌లో ఓ స్వీట్ షాపు వద్ద జరిగిన వివాదం కూడా హత్యకు మరో కారణంగా తెలుస్తోంది. పోలీసులు నిందితుల్లో కొందరిని ఇప్పటికే అదుపులోకి తీసుకోగా మిగిలిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుల్లో ఓ రౌడీషీటర్ ఉన్నట్లు సమాచారం.

కండలేరులో 47.253 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 47.253 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 105
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 192
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 212
లేయర్ చికెన్ : 170

పోలీసులకు వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఉలవపాడు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్‌పై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలను తప్పుదోవ పట్టించి వివాదాలు సృష్టించే విధంగా ఉన్న ఈ వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పోతురాజు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడు మధుసూదన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నవీన్, ఐటీ వింగ్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు దస్తగిరి, సుధాకర్, అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, సురేంద్ర, తాటిపర్తి రమేష్‌లున్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ, ఎస్సైలు

ఆత్మకూరు: ఇద్దరు దొంగల్ని అరెస్ట్ చేశామని ఆత్మకూరు సీఐ జి.గంగాధర్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఎస్సైలు ఎస్‌కే జిలానీ, బి.సాయిప్రసాద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు మండలం దేపూరు గ్రామానికి చెందిన తూమాటి లక్ష్మమ్మ అనే వృద్ధురాలు గతేడాది ఆగస్ట్ 13వ తేదీన సొంత పని నిమిత్తం జంగాలపల్లి గ్రామానికి వెళ్లింది. పని చూసుకుని తిరిగి స్వగ్రామానికి వచ్చే క్రమంలో బస్‌షెల్టర్ వద్ద నిలబడింది. కోవూరు స్టౌ బీడీ కాలనీకి చెందిన పఠాన్ రహీం, దేవరకొండ శివ అనే పాత నేరస్తులు సోమశిల నుంచి మోటార్‌బైక్‌పై లక్ష్మమ్మ వద్దకు వచ్చారు. దేపూరుకు ఎలా వెళ్లాలని అడుగుతూ ఆమె మెడలోని సరుడు లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నెల్లూరుపాళెం వద్ద పఠాన్ రహీం, బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన పఠాన్ రఫీ అనే ఇద్దరు అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్సై ఎస్‌కే జిలానీ వారిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో పఠాన్ రహీం అప్పట్లో వృద్ధురాలి మెడలో సరుడును శివతో కలిసి చోరీ చేసినట్లు అంగీకరించాడు. మరో దొంగతనం చేసేందుకు రఫీతో కలిసి ఈ ప్రాంతానికి వచ్చానన్నాడు. శివ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

14న నెల్లూరులో క్రికెట్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని క్రీడా ప్రాంగణంలో అండర్-23 జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు వైట్ డ్రెస్ కోడ్‌లో, సొంత కిట్‌తోపాటు ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.